# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com
www.prajaswaramdaily.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 28 | మంగళవారం, 15 అక్టోబర్ 2024 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool |



# అనుమానాలొద్దు..
# పెట్టుబడులు పెట్టండి

## అన్ని విధాలుగా సహకరిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులతో సమావేశం
కంపెనీ పురోగతి, ఇతర అంశాలపై చర్చ
ఈ నెల 17న ఢిల్లీకి ముఖ్యమంత్రి



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కరలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి హైదరాబాద్ కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీని సీఎం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఫాక్స్‌కాన్ కంపెనీ పురోగతి, ఇతర అంశాలను ఆ సంస్థ ప్రతినిధులను అడిగి సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకున్నారు. అలాగే ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పించడంలో అన్ని విధాలుగా సహకరిస్తామని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి వారికి భరోసా ఇచ్చారు. కంపెనీ విస్తరణలో భాగంగా తెలంగాణలో మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ఫాక్స్‌కాన్ ముందుకు రావాలని కోరారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 17న ఢిల్లీకి వెళ్లనున్నారు. ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు హాజరవనున్నారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరు కానున్నారు. త్వరలో జరగబోయే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించనున్నట్టు సమాచారం.



## త్వరలో మంత్రివర్గ విస్తరణ

కుల గణన తర్వాతే స్థానిక ఎన్నికలు
పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
సోషల్ సెన్స్ లేకున్నా సోషల్ మీడియా యూజ్ చేస్తున్నారని ఫైర్
హైడ్రా, మూసీ ప్రక్షాళనలో రాజీ పడేది లేదని వెల్లడి

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**
సోషల్ మీడియాని సోషల్ సెన్స్ లేకుండా వాడుతున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, ఇది తాత్కాలిక ఆనందం ఇచ్చినా దీర్ఘకాలికంగా బీఆర్ఎస్ పార్టీకి నష్టం చేకూరుస్తుందని హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లోకల్ బాడీ ఎన్నికలను సాధ్యమైనంత తొందరగా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో కుల గణన చేపట్టిన మిగతా 2లో..



## ఆర్టీసీ ఛార్జీల పెంపు దుమారం

పండగపూట టికెట్ల ధరలు పెంచారని విమర్శలు
ప్రైవేటు ట్రావెల్స్ అందినకాడికి దోచుకుంటున్నారని ఆగ్రహం
స్పెషల్ బస్సుల్లోనే చార్జీలు పెంచాం
రెగ్యులర్ బస్సుల్లో పెంచలేదు
క్లారిటీ ఇచ్చిన సజ్జనార్ 02

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

92 నియోజకవర్గాల్లో 641 పనులకు గ్రీన్ సిగ్నల్
1323.86 కిలోమీటర్ల కొత్త రోడ్ల నిర్మాణం
రూ. 1377.66 కోట్లు రిలీజ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం 02



## ప్రొఫెసర్ సాయిబాబాకు తుది వీడ్కోలు

ఉద్యమ పాటలు, డప్పు చప్పుళ్ల మధ్య అంతిమయాత్ర
గన్‌పార్క్ వద్ద సంతాప సభకు అనుమతి నిరాకరణ..
భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించిన కుటుంబ సభ్యులు 02




## ప్రజలను ఆర్టీసీ దోచుకుంటోంది

నర్సాపూర్‌లో బస్టాండ్ ఎదుట ప్రయాణికుల ధర్నా
అధిక చార్జీలు వసూలు చేస్తున్నారంటూ ఆందోళన
చార్జీల పెంపుపై ఎమ్మెల్యే హరీష్ రావు ఫైర్ 02

## మా ఇండ్లు కూల్చొద్దు


హైకోర్టు ఆశ్రయించిన మూసీ బాధితులు
దశాబ్దాలుగా ఇళ్లలో ఉంటున్నామని పిటిషన్లు..
నేడు విచారణ 02



## మేము ఏపీకి వెళ్లం.. ఇక్కడే ఉంటం
## డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి

క్యాట్‌ను ఆశ్రయించిన ఏపీ, తెలంగాణ ఐఏఎస్ అధికారులు
ఆరుగురు ఆఫీసర్లు వేర్వేరుగా పిటిషన్లు
పిటిషన్లపై నేడు విచారించే చాన్స్ 02





## కాంగ్రెస్ పాలనలోనే ఆలయాలపై దాడులు 02

పోలీసు వ్యవస్థపై నమ్మకం లేకుండా పోతుంది
కేంద్ర మంత్రి బండి సంజయ్

## రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతుండ్రు

దామగుండంలో రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తున్నాం
మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం

రాష్ట్రంలో శాంతిభద్రతలు
### దిగజారినయ్
ముత్యాలమ్మ గుడిపై దాడి దుర్మార్గం
బాధ్యులపై చర్యలు తీసుకోవాలి 02





# మేము ఏపీకి వెళ్లం.. ఇక్కడే ఉంటం

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తెలుగు రాష్ట్రాల మధ్య ఐఏఎస్ అధికారుల వివాదం నడుస్తోంది. ఏపీ కేడర్ అధికారులను రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో నలుగురు ఐఏఎస్ అధికారులు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. మొత్తం నలుగురు ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణిప్రసాద్, ఆమ్రపాలి, సృజన క్యాట్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయాలని వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. తెలంగాణలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని ముగ్గురు ఐఏఎస్‌లు వాకాటి కరుణ, వాణిప్రసాద్, ఆమ్రపాలి కోరగా, ఏపీలోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరిన ఐఏఎస్ అధికారిని సృజన కోరారు. వీరు దాఖలు చేసిన పిటిషన్లపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ మంగళవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

**16 లోపు రిపోర్ట్ చేయాలని ఆదేశం..**

తెలంగాణ కేడర్ కావాలని కోరిన 11 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. ఈ విజ్ఞప్తి చేసిన 11 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్ లో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశించింది. ఈనెల 16లోగా తెలంగాణలో రిపోర్టు చేయాలని తెలిపింది. పిటిషన్ దాఖలు చేసే ముందు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలితో పాటు పలువురు ఐఏఎస్‌లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో చర్చించారు. ఆమె ఆదేశాల మేరకు వారు క్యాట్‌లో పిటిషన్ వేశారని తెలుస్తోంది. పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆ అధికారులు ఇంకా తెలంగాణ ప్రభుత్వం నుంచి రిలీవ్ కాలేదు. ఏపీకి వెళ్లేందుకు నిరాకరిస్తూనే తెలంగాణ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఈ ఐఏఎస్ అధికారులు బిజీగా ఉన్నారు.

# మా ఇండ్లు కూల్చొద్దు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

మూసీ రివర్ బెడ్ బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. తమ ఇళ్లు, కట్టడాలపై అధికారులు మార్కింగ్ చేయటంతో బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ తమ ఇళ్లను యంత్రాంగం కూలగొడుతుందోనని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు తమ ఇళ్లపై మార్కింగ్ వేసిన విషయాన్ని వీరంతా హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మూసీ సుందరీకరణ కోసం ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూసీ రివర్‌బెడ్‌లో ఉన్న ఇళ్ల కూల్చివేతను అధికారులు ఇప్పటికే ప్రారంభించారు. అయితే తమ ఇళ్లు కూల్చకుండా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో కోరారు. దశాబ్దాలుగా ఈ ఇళ్లలోనే తాము నివాసం ఉంటున్నామని, ఇప్పుడు అవి కూలగొడితే తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మూసీ రివర్ బెడ్ పిటిషన్లపై నేడు ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టనుంది.

# త్వరలో మంత్రివర్గ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం, స్థానిక సంస్థల్లో మెజార్టీ సీట్లు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 50 వేల వరకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో 30 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయన్నారు. పదేళ్లలో బీర్ఎస్ ఇచ్చిన రుణమాఫీ ఎంత, కాంగ్రెస్ 9 నెలల్లో ఇచ్చిన రుణమాఫీ ఎంతో రైతులు గుర్తించాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. వీలైనంత త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని తెలిపారు. హైడ్రా, మూసి ప్రక్షాళన విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టం చేశారు. పేదలకు అన్యాయం జరగనివ్వమని తెలిపారు.

# ప్రొఫెసర్ సాయిబాబాకు తుది వీడ్కోలు



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

పౌర హక్కుల ఉద్యమకారుడు, రచయిత, విద్యావేత్త, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాకు పౌర హక్కుల నేతలు, ప్రజాసంఘాల నాయకులు సోమవారం తుది వీడ్కోలు పలికారు. శనివారం రాత్రి తుది శ్వాస విడిచిన సాయిబాబా పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం నిమ్స్ మార్చురీ నుంచి ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అక్కడి నుంచి ఆయన పార్థివదేహాన్ని గన్‌పార్క్‌కు తీసుకెళ్లారు. అక్కడ 5 నిమిషాల పాటు సాయిబాబా సంతాప సమావేశం ఏర్పాటు చేస్తామని కుటుంబ సభ్యులు, అభిమానులు కోరగా.. పోలీసులు నిరాకరించారు. సాయిబాబా పార్థివదేహాన్ని అంబులెన్స్‌లోనే ఉంచి నిర్వహిస్తామని చెప్పినా అనుమతి ఇవ్వలేదు. దీంతో సాయిబాబా అభిమానులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడే ప్రొఫెసర్ సాయిబాబా పార్థివదేహానికి పలువురు నివాళులర్పించారు. శ్రీనివాసా హైట్స్ వద్ద కోదండ రామ్, విరసం, అల్లం నారాయణ, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రజా సంఘాలు, ఢిల్లీ నుంచి విద్యార్థి సంఘాలు సహా ఇతర ప్రముఖులు భారీగా తరలి వచ్చి నివాళులు అర్పిస్తున్నారు.

**కేటీఆర్‌కు చేదు అనుభవం..**

ప్రొఫెసర్ సాయిబాబా పార్థివ దేహానికి మాజీ మంత్రి కేటీఆర్ నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు నిరసన సెగ తగిలింది. సాయిబాబా భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న సమయంలోనే ప్రజా సంఘాల నేతలు కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గో బ్యాక్ అంటూ నినదించారు. సాయిబాబా పదేళ్లు జైల్లో ఉంటే బీఆర్ఎస్ ఏం చేసిందని నిలదీశారు. ఇప్పుడు నివాళులు అర్పించేందుకు ఎలా వచ్చారని అడిగారు. బీఆర్ఎస్ హయాంలో 150 మందిపై అకారణంగా ఉపా కేసులు పెట్టారని గుర్తు చేశారు.

# ప్రజలను ఆర్టీసీ దోచుకుంటోంది

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



సామాన్యుల జేబులను ఖాళీ చేసేలా.. టీజీఎస్ ఆర్టీసీ టికెట్ ధరలను పెంచింది. పెంచిన బస్సు ఛార్జీలు సామాన్యుడికి తలకు మించిన భారవమతున్నది. దీంతో అధిక బస్సు ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లాల నర్సాపూర్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ముందు ప్రయాణికులు ధర్నా చేపట్టారు. ఆర్టీసీ అధికారులు పల్లె వెలుగు బస్సులు ఏర్పాటు చేసి దాంట్లో స్పెషల్ బస్సుల పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగ వేల ప్రయాణికులను దోచుకుంటున్నారంటు ధర్నా చేపట్టారు. ప్రయాణికుల ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా, టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆర్టీసి టికెట్ ధరలు విపరీతంగా పెంచి బతుకమ్మ, దసరా పండుగ సమయంలో సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికుల నుంచి ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం అని ధ్వజమెత్తారు. టికెట్ ధర రూ. 140తో జేబీఎస్ నుంచి సిద్దిపేటకు వెళ్లిన ప్రయాణికుడు తిరుగు ప్రయాణంలో టికెట్ ధర రూ. 200 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. హనుమకొండ నుంచి హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సు ప్రయాణం సాధారణ రోజుల్లో రూ. 300 ఉంటే, పండుగ వేళ రూ.420కి ఛార్జీలు పెంచిందని తెలిపారు. బస్సుల సంఖ్య పెంచకుండా, టికెట్ ఛార్జీలు పెంచి తెలంగాణ ప్రజలకు పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమే ప్రజా పాలనన ముఖ్యమంత్రి గారు..? అని హరీశ్ రావు ప్రశ్నించారు.

# యాదాద్రి తరహాలో వేములవాడ అభివృద్ధి

## మంత్రి కొండా సురేఖ

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

మంత్రి కొండా సురేఖ వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. కుటుంబంతో కలిసి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనవడి పుట్టు వెంట్రుకల మొక్కులు స్వామివారికి చెల్లించుకున్నామని తెలిపారు. మంత్రి అయిన తర్వాత ఇంతకుముందు కూడా స్వామివారి దర్శనం కోసం వచ్చామన్నారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్కడ ఈవోను కూడా మార్చామని గుర్తు చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. వచ్చే మాసంలో అభివృద్ధిపై సీఎం మీటింగ్ కూడా నిర్వహిస్తారని పేర్కొన్నారు. యాదాద్రి తరహాలో వేములవాడ కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వేములవాడ రాజన్నకు 65 కేజీల బంగారం, 5000 కిలోల వెండి ఉంది. వెండి, బంగారాన్ని దేవుడి కార్య నిమిత్తం వాడుదామన్నారు. గీసుకొండ సంఘటనపై ప్రశ్నించగా ఇది దేవాలయం ఇక్కడ ఎలాంటి రాజకీయాలు మాట్లాడనని తేల్చి చెప్పారు.



# క్వాలిటీలో రాజీపడొద్దు

## ఫుడ్స్ ఫ్యాక్టరీని తనిఖీ చేసిన మంత్రి సీతక్క

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్‌లోని నాచారంలో ఉన్న తెలంగాణ ఫుడ్స్ ఫ్యాక్టరీని మంత్రి సీతక్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు బాలామృతంతో సహా పలు రకాల ఆహార వస్తువులను టీజీ ఫుడ్స్ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆహార పదార్థాల నాణ్యతను, పరిసరాల పరిశుభ్రతను మంత్రి సీతక్క చెక్ చేశారు. పౌష్టికాహారంపై సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. పిల్లలకు సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలు అత్యంత నాణ్యతతో ఉండాలని మంత్రి సూచించారు. ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూదని.. పరిసరాల పరిశుభ్రతతో పాటు, ముడి సరుకుల నుంచి ప్యాకేజింగ్ వరకు ప్రతి దశలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సిబ్బందికి సూచించారు. కొత్త యూనిట్ల నిర్మాణం పదేళ్లుగా పూర్తి కాలేదని.. వెంటనే వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ఆర్టీసీ ఛార్జీల పెంపు దుమారం

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో ఆర్టీసీ ఛార్జీల పెంపు వ్యవహారం దుమారం రేపుతోంది. స్పెషల్ ఛార్జీల పేరుతో పండగపూట ఆర్టీసీ టికెట్ల ధరలు పెంచారని తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ స్పెషల్ ఛార్జీలపై విమర్శలు గుప్పించింది. బతుకమ్మ, దసరా పండగ అయ్యింది. ఫెస్టివల్ కోసం ఊరెళ్లిన వారంతా తిరుగు ప్రయాణం అవుతున్నారు. కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్, కార్లు అందినకాడికి దోచుకుంటున్నాయి. నేటి నుంచి స్కూళ్లు, కాలేజీలు రీ ఓపెన్ అవుతాయి. ఈ క్రమంలో సోమవారం నుంచి బస్సుల్లో రద్దీ నెలకొంది. ఫెస్టివల్ కోసం సిటీ నుంచి చాలా మంది ఊరు వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్స్ ఇప్పటికే బుక్ అయ్యాయి. స్పెషల్ బస్సుల్లో ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయి.

**ఛార్జీలు పెంచలేదు: సజ్జనార్**

దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ఛార్జీలు పెంచలేదని, చార్జీలు పెంచారనే వార్తల్లో వాస్తవం లేదని సజ్జనార్ అన్నారు. ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ విపరీతంగా టికెట్ ధరలు పెంచిందని జరుగుతున్న ప్రచారం తప్పు అని తెలిపారు. ప్రధాన పండుగులైన సంక్రాంతి, దసరా, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, ఉగాది, తదితర సమయాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికులు ఎక్కువగా సొంతూళ్లకు వెళ్తుంటారని, ఈ సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోందని తెలిపారు. రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో హైదరాబాద్ సిటీ బస్సులను కూడా జిల్లాలకు నడుపుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ ఉండదు కాబట్టి ఆ బస్సులు ఖాళీగా వెళ్తుంటాయని వివరించారు. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.16 జారీ చేసిందని తెలిపారు.

# రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతుండ్రు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో ఓ వైపు మూసీ నదికి మరణ శాసనం రాస్తూ మరోవైపు సుందరీకరణ ప్రాజెక్టు అంటారా? అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ అంతరార్థమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమపై పదేళ్ల పాటు ఒత్తిడి చేసినప్పటికీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు అంగీకరించలేదన్నారు. కానీ ఈ ప్రభుత్వం ఏ ప్రయోజనాలను ఆశించి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని నిలదీశారు. రాడార్ స్టేషన్‌కు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలతో కలిసి పోరాడుతామని హెచ్చరించారు. జనావాసాలు లేని ఇలాంటి రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అలాంటి వ్యవస్థను తెలంగాణలో ఏర్పాటు చేయడం ఏమిటి? అని ప్రశ్నించారు. దామగుండంలో రాడార్ స్టేషన్‌ను తమ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. గంగానదికి ఒక న్యాయం... మూసీకి ఒక న్యాయమా? అని మండిపడ్డారు.

**రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారినయ్**

సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంపై దాడి ఘటనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ఆలయంపై దాడి చేయడం హైదరాబాద్ నగర సహనశీలతకు మచ్చను తీసుకొస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. దుర్మార్గమైన చర్యలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొద్ది నెలలుగా రోజులుగా శాంతిభద్రతలు దిగజారుతున్నాయని.. దీనికే కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

**అసలేం జరిగిందంటే..?**

కుమ్మరిగూడలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేశారు. ఇది గమనించిన స్థానికులు ఓ నిందితుడిని పట్టుకొని చితకబాదారు. స్థానికుల దాడిలో గాయపడ్డ నిందితుడిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. సదరు వ్యక్తి స్పృహలో లేడని.. స్పృహలోకి వస్తేనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఓ వ్యక్తి ఆలయం గేట్‌ని కాలుతో తన్ని లోపలికి వెళ్లిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీనికి సంబంధించి పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ రానుంది. నూతన రోడ్ల నిర్మాణానికి రూ. 1377.66 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 92 నియోజకవర్గాల్లో 641 పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రామాల్లో 1,323 కి.మీ మేర కొత్త రహదారుల నిర్మాణ పనుల కోసం రూ.1,377.66 కోట్లను రిలీజ్ చేసింది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడంపై సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క థ్యాంక్స్ చెప్పారు. అవసరాన్ని, అవకాశాన్ని బట్టి మరిన్ని నిధులు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. సీఆర్ఆర్ రోడ్ల కోసం మరో రెండు, మూడు రోజుల్లోనే రూ. 400 కోట్ల మేర నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు.

# కాంగ్రెస్ పాలనలోనే ఆలయాలపై దాడులు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే హిందువుల ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడ లోని ముత్యాలమ్మ గుడిని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలపై దాడికి పాల్పడ్డ వ్యక్తి పిచ్చోడని పోలీసులు ముద్ర వేస్తున్నారని, ఇది కరెక్ట్ కాదన్నారు. పోలీసు వ్యవస్థపై నమ్మకం లేకుండా పోతుందన్నారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం తనను బాధించిందన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులున్నారు.



# తెలంగాణలో మూడు రోజులు వానలు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, ములుగు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. మంగళ, బుధవారాల్లో ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్‌తోపాటు నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవొచ్చు.ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టం నుంచి 5.8 కి.మీ. ఎత్తు వరకు ఓ చక్రవాతపు ఆవర్తనం కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి.

**హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం**

హైదరాబాద్ నగరంలోని పలుచోట్ల వర్షం కురిసింది. కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ, నిజాంపేట, కేపీహెచ్‌బీ కాలనీ, ప్రగతినగర్, బాచుపల్లి, కొంపల్లి, కుత్బుల్లాపూర్, అల్వాల్, నేరెడ్‌మెట్, గచ్చిబౌలి, మియాపూర్, ఖాజాగూడ, బంజారాహిల్స్‌లో వర్షం పడింది. అలాగే. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, వికారాబాద్ జిల్లా తాండూరుతో పాటు బహదూర్‌పల్లి, సూరారం, గుండ్లపల్లి పోచంపల్లి, సుచిత్ర, కొంపల్లి, జీడిమెట్ల, బాలానగర్, మేడ్చల్, కృష్ణాపూర్, గండిమైసమ్మ, మల్లంపేట్, దుండిగల్‌లోనూ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని.. నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతాయని పేర్కొంది. తూర్పు, ఆగ్నేయ దిశలో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

# మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట





# దళారుల నమ్మి మోసపోవద్దు

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :**
రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధి లోని గోవిందా పూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువుతో విలవిలలాడిన దుబ్బాక నియోజకవర్గంలో గోదావరి జలాలు పారించి సస్యశ్యామలం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎక్కడో ఉన్న గోదావరి జలాలను కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లో నీళ్లు నిలువ చేసుకొని కాలువల ద్వారా పంట పొలాలకు నీరు అందించడం జరుగుతుందన్నారు. కరువు కాటకాలకు నిలయమైన దుబ్బాక నియోజకవర్గం నేడు పంటలకు నిలయంగా మారిందన్నారు. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రం ప్రారంభంలో బీఆర్ఎస్ నాయకులు కొబ్బరికాయ కొట్టగా కాంగ్రెస్ నాయకులు అడ్డుపడి ప్రోటోకాల్ పాటించడం లేదంటూ ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పదవీకాలం పూర్తయిన పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొట్టడం ఏంటని మండిపడ్డారు. ఇటీవల దుబ్బాకలో చెరుకు శ్రీనివాస్ రెడ్డిని కళ్యాణ లక్ష్మిచెక్‌ల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘించారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇప్పుడు ప్రోటోకాల్ గుర్తుకు రాలేదా అన్నారు. ఐకేపీ ఏపీఎం యాదగిరి గతంలో గజ్వేల్ లో ఏపీఎంగా బీఆర్ఎస్ నాయకులకు సేవలందించి అదే మైక్రంలో ఉన్నట్లుగా స్పష్టంగా అర్థమైందన్నారు. ఈ అంశంపై జిల్లా అధికారులకు ఫిర్యాదుచేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడీ మధుసూదన్, డీపీఎం రాజయ్య, ఏపీఎం యాదగిరి, తహసీల్దార్ చంద్ర శేఖర్ రావు, వెంకట లక్ష్మ్మ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రహీముద్దీన్, బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ బీసీ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ చంద్రమౌళి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పడాల రాములు, ఉపాధ్యక్షులు మద్దెల స్వామి, నాయకులు బండారు లాలు, ఆది వేణుగోపాల్, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



# నూతనంగా జిల్లా సంక్షేమ అధికారిగా హైమావతి

**మెదక్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :**
మెదక్ జిల్లా సంక్షేమ అధికారిగా నియమితులైన హైమావతి సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వారిని పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిసి, బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా తొర్రూరు సీడీపీవోగా దాదాపు 06 సంవత్సరాలుగా పనిచేసిన హైమావతిని పదోన్నతి కల్పించి మెదక్ జిల్లా సంక్షేమ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి హైమావతి మాట్లాడుతూ పదోన్నతి బాధ్యతను పెంచుతుందని, జిల్లా సంక్షేమ శాఖను అభివృద్ధి పథంలో నడిచే విధంగా ప్రణాళిక బద్ధంగా సంబంధిత శాఖల, అధికారులు సమన్వయంతో పని చేస్తామని ఆమె తెలిపారు. గతంలో జిల్లా సంక్షేమ అధికారిగా పని చేసిన బ్రహ్మాజీ విధుల నుండి రిలీవై సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ వెళ్లారు. పదోన్నతిపై మెదక్ జిల్లా సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన హైమావతిని జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.



# మేడ్చల్ ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తు ఆహ్వానం

**ప్రిన్సిపల్ హనుమాన్‌నాయక్**

**మేడ్చల్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం) :**
మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సులలో సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా ఐటీఐ ప్రిన్సిపల్ హనుమాన్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 2024 25 ఒక సంవత్సరం కోర్సులైన మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటో మిషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిసాన్ యూజింగ్ అడ్వాన్స్ డ్ టూల్ అదేవిధంగా 202426 రెండు సంవత్సరాల కోర్సులైన బేసిక్ డిజైనిర్, వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్), అడ్వాన్స్ డ్ మెకానిక్ టెక్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి పాసై 14 సంవత్సరాల వయస్సు పైబడిన వారు అర్హులని తెలిపారు. ఇందుకుగాను అభ్యర్థులు www iti, telangana.gov.in అనే వెబ్ సైట్‌లో నమోదు చేసుకొని అడ్మిషన్ పొందేందుకు 14/10/2024 తేదీ నుండి 19/10/2024 వరకు ఉదయం 11గంటల వరకు రావాలని ప్రిన్సిపల్ హనుమాన్ నాయక్ తెలియజేశారు.

# సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



**మెదక్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 35 దరఖాస్తులు. రైతు రుణమాఫీ 02, పింఛన్లు 01, భూ సమస్యలు 15, 2 డబుల్ బేడ్ రూమ్ 01, ఇతర సమస్యలు 16 ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించాలని ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతి తహశీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**నార్సింగి, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :**
కారు బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన వల్లూరు శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దిన్ కథనం ప్రకారం నార్సింగి పట్టణ కేంద్రానికి చెందిన గుర్రాల సిద్దిరాములు తన బంధువు కత్తెర యాదగిరి గ్రామం అచ్చంపేట కత్తెర నర్సింహులు (80)కు చికిత్స నిమిత్తం నార్సింగి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు కారులో బయలుదేరారు. కారును కత్తెర యాదగిరి అతివేగంగా నడుపుతూ వల్లూరు శివారులోకి రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో కారు పల్టీ కొట్టి కారులో ప్రయాణిస్తున్న కత్తెర నర్సింహులు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి చికిత్స నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా నార్సింగి శివారులో మృతి చెందాడు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# వైభవంగా దుర్గమ్మల నిమజ్జనం



**నార్సింగి, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :**
నార్సింగి మండల కేంద్రంలో నార్సింగి దుర్గా మాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గామాత శరన్నవరాత్రుల ఆదివారం ఘనంగా ముగిసాయి. సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమర్జన కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా నిరంతరాయంగా అందరూ ఏకతాటిపై వచ్చి నార్సింగి పట్టణంలో దుర్గామాత శరన్నవరాత్రుల నిర్వహించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో కూడా నవరాత్రులు నిర్విఘ్నంగా జరపాలని కోరారు. అమ్మ వారి దర్శనం, ప్రత్యేక పూజలు తన మనస్సుకు శాంతి, ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులకు లక్ష రూపాయల నగదు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాబు, మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్‌గౌడ్, తాజా మాజీ వార్డు సభ్యులు ఫరీద్, గణేష్, జమీర్, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీపతిరావు, రాజు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, నార్సింగి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధిపతి డాక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.




# సర్కార్ ఆదేశాలు బేఖాతరు

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం) :**
ప్రభుత్వం ఫైనల్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఫోటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాలని గతంతో సర్కార్ ఆదేశించింది. అక్టోబర్ 7వ తేదీలోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫోటో ఏర్పాటు చేయాలని తెలిపినప్పటికీ దౌల్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఇప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఫోటో పెట్టలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఫోటో నమూనాను కూడా విడుదల చేస్తూ ప్రభుత్వం కార్యాలయాల్లో సీఎం పెట్టాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి పదకొండు నెలలు పూర్తయిన ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫోటో లేకపోవడం గమనార్హం.

# అదృశ్యమైన తల్లికొడుకులు సేఫ్

**నార్సింగి, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :**
నార్సింగి కుటుంబ కలహాలతో దసరా పర్వ దినాన తల్లి, కుమారుడు అదృశ్యమై అందరికీ ఆవేదనకు గురిచేసి రెండు రోజుల అనంతరం దొరికిన సంఘటన మండలపరిధిలోని శేరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ కథనం ప్రకారం శేరిపల్లి గ్రామానికి చెందిన చెప్యాల బాబుకు అదే గ్రామానికి చెందిన జ్యోతితో పదిహేను సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి సుష్మా (11), కుమారుడు సాత్విక్ (6) సంతానం. అయితే గత కొద్ది సంవత్సరాలుగా చెప్యాల బాబు తల్లి దండ్రులు కూతురు సుష్మాతో పాటు మేడ్చల్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. బాబు తన భార్య కొడుకు సాత్విక్‌తో పాటు పెయింటింగ్ పనులు చేస్తూ శేరిపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 12న భార్య జ్యోతితో కుటుంబ నేపథ్యంలో గొడవ జరగగా, అతను దసరా వేడుకలను చూడడానికి ఇంట్లో నుంచి ఊర్లోకి వెళ్ళాడు. అనంతరం ఇంటికి వచ్చి చూడగా జ్యోతి, సాత్విక్‌లు కనబడలేదు.





అదే గ్రామంలో ఉన్న జ్యోతి తల్లిగారి ఇంటికి వెళ్లిందని భావించి అక్కడకు వెళ్లి చూడగా అక్కడికి రాలేదని తెలిసి చుట్టూ పక్కల, తెలిసిన వారి వద్ద వెదకగా వారి ఆచూకీ లభించలేదు. దీంతో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జ్యోతి ఫోన్ ను ట్రేస్ చేయగా, అప్పటి వరకు స్విచ్ ఆఫ్ వచ్చిన ఫోన్ సోమవారం 14 న ఉదయం జ్యోతి ఫోన్ స్విచ్ ఆన్ చేయగానే ట్రెస్ అయ్యిందని, ఆమె లొకేషన్ శంకరం పేట్ మండలం కొరివిపల్లి గ్రామంలో ఉన్నట్లు తెలిపిందని అన్నారు. జ్యోతి కోరివిపల్లి గ్రామంలోని తన మేనమామ ఇంట్లో ఉన్నట్లు అక్కడికి చేరుకున్న పోలీసులు తెలుసుకుని, జ్యోతి, సాత్వికలను కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

# మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్



## ఎమ్మెల్యేలను కలిసిన అంబేద్కర్ సంఘం నాయకులు

**మేడ్చల్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం) :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లా రెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలను సోమవారం రాష్ట్ర అంబేద్కర్ జై భీమ్ సేవా సంఘం అధ్యక్షుడు బక్క నరేందర్, మేడ్చల్ మండల ప్రధాన కార్యదర్శి ఏర్పుల హరిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.





## ప్రజావాణికి 33 ఫిర్యాదులు

**శామీర్‌పేట్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (33) ఫిర్యాదులు వచ్చాయని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి అడిషనల్ కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు





**శామీర్‌పేట్, అక్టోబర్ 14(ప్రజా స్వరం) :** శామీర్‌పేట్ మండలం అలియాబాద్‌లోని హనుమాన్ ఆలయం వద్ద నెలకొల్పిన దుర్గామాత విగ్రహం వద్ద అలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అన్నవితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అన్నప్రాసదం కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ఈ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా అన్నప్రాసదం కార్యక్రమం నిర్వహించినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో దుర్గామాత యూత్ సభ్యులు నాగార్జున, శ్రీకాంత్, సందీప్‌రెడ్డి, ప్రకాశ్, ఆనంద్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## నేడు రేణుక ఎల్లమ్మ కళ్యాణం





**శామీర్‌పేట, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :** శ్రీరేణుక ఎల్లమ్మ కళ్యాణం మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం 7వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గ్రామంలోని బొడ్రాయి, గ్రామ దేవతలకు బోనాలను నిర్వహించారు. సాయంత్రం గంగతెప్పను డోలు వాయిద్యాలతో ఊరేగించి ఆలయం వద్ద వదిలారు. మంగళవారం ఉదయం ఘటం తీయుట, లందకు వెల్లుట నిర్వహించనున్నారు. అనంతరం 11:45 గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గ్రామం నుంచి సామూహికంగా అమ్మవారికి బోనాలను ఊరేగించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని నిర్వహకులు కోరారు.

## గ్రూప్1 పరీక్షకు జిల్లాలో 27 కేంద్రాలు



**శామీర్‌పేట్, అక్టోబర్ 14(ప్రజా స్వరం) :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షకు అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుండి 1:30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాలలోనికి అనుమతిస్తామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుండి 27 వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షకుగాను సంబంధిత అధికారులు సమన్వయంతో పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ గౌతం తెలిపారు. పరీక్షకు జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 12:30 గంటల నుండి 1:30 వరకు మాత్రమే పరీక్షా కేంద్రాలలోనికి అభ్యర్థులను అనుమతిస్తారని స్పష్టం చేశారు.

## తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కలిసిన నేతలు



**మేడ్చల్, అక్టోబర్ 13 (ప్రజా స్వరం) :** మేడ్చల్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ సోమవారం తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హచ్ కమిటీ మెంబర్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ ముజ్జిబ్ వుద్దిన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మొహమ్మద్ షఫీవుద్దీన్, మేడ్చల్ మున్సిపల్ మైనార్టీ సీనియర్ నాయకులు మొహమ్మద్ యూసుఫ్, మండల మైనార్టీ అధ్యక్షులు రాజు, మొహమ్మద్ పాషా, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు అరిఫ్, పీర్జాదిగూడ కార్పొరేషన్ మజార్, పాషా, అజీమ్, అర్మాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గ ప్రజలందరికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు తూంకుంటలో ఇందిరమ్మ కమిటీల సమావేశం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్

**శామీర్‌పేట్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :** నేడు ఇందిరమ్మ కమిటీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ సోమవారం తెలిపారు. శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్ ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి చెందిన వివిధ పథకాలకు సంబంధించి నూతనంగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కోసం కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకరౌడ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిలు విచ్చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి శామీర్‌పేట మండలం, తూంకుంట మున్సిపల్లోని కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని వైఎస్ గౌడ్ కోరారు.



## అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శామీర్‌పేట్, (ప్రజా స్వరం) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట కళాశాలలో పార్ట్ టైమ్ అతిథి ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.ఇష్రత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్ పార్ట్ టైం అతిథి ఒప్పందం ప్రకారం, బోధించేందుకు ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఈ నెల 16 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని, సెట్, నెట్, పీహెచ్‌డీ చేసి బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు.

## తొలగించిన విగ్రహాలను ఏర్పాటు చేయాలి

### మున్సిపల్ కమిషనర్‌ను కోరిన కౌన్సిలర్లు



**మేడ్చల్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి గ్రామం వద్ద చేపడుతున్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జాతీయ రహదారి 44 అధికారులు తొలగించిన మహనీయుల విగ్రహాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కౌన్సిలర్లు జాకట దేవరాజ్, మానస శ్రవణ్ గుప్తా, నారెడ్డి కృష్ణవేణి, రొయ్యపల్లి సరిత మల్లేశ్‌గౌడ్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తొలగించిన మహాత్మా గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద, వేమన విగ్రహాలను వెంటనే స్థానికంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం లేకుండా మహనీయుల విగ్రహాలను తొలగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తొలగించిన విగ్రహాలను తిరిగి స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరిపి ప్రతిష్టించాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాకట దేవరాజ్, నాయకులు రొయ్యపల్లి మల్లేశ్‌గౌడ్, శ్రవణ్ గుప్తాలు పాల్గొన్నారు.

# కఠిన చర్యలు తీసుకోవాలి

## అమ్మవారి విగ్రహం ధ్వంసంపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఫైర్



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :** సికింద్రాబాద్ మార్కెట్ పీఎస్ పరిధిలో అమ్మవారి విగ్రహాన్ని, ఓ వర్గానికి చెందిన వ్యక్తి తో పాటు మరో ఇద్దరు నీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ తెలుపుతూ సోమవారం సాయంత్రం ఏడు గంటలకు ఓ వీడియోను విడుదల చేశారు. అమ్మవారి విగ్రహం ధ్వంసం జరిగిన ప్రదేశాన్ని అన్ని పార్టీల నాయకులు సందర్శించారని, తనను హౌస్ అరెస్ట్ చేయడం ఏమిటని పోలీసులను ప్రశ్నించారు. హిందూ కార్యకర్తలు నిరసన చేస్తున్న సందర్భంగా వారికి సంఘీభావం తెలిపేందుకు, ఇంటి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించిన తమను పోలీసులు ఎందుకు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక టెర్రరిస్ట్ ను ఎలా బ్లాక్ చేస్తారో, ఆ విధంగా పోలీసులు మా ఇంటి చుట్టూ ఉన్నారని తెలిపారు. గుడి ప్రాంగణంలో ధ్వంసం చేసిన ప్రాంతానికి ప్రతి లీడర్ ను అనుమతించారని తనను ఎందుకు అడ్డుకుంటున్నారని రాష్ట్ర సీఎంతో పాటు పోలీస్ కమిషనర్ కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. గుడి ధ్వంసం చేసిన తర్వాత ఓ స్టేట్మెంట్ వస్తుందని, వ్యక్తి మెంటల్ డిస్టర్బ్ ఉన్నారని, ఈ విధంగా గతంలో కూడా ఓల్డ్ సిటీ, న్యూ సిటీ గుళ్ళపై దాడులు జరిగితే ఈ విధంగా స్టేట్మెంట్ లు ఇవ్వడం పోలీసుల నుంచి వచ్చిందని తెలిపారు. ఓ వ్యక్తి డిస్టర్బ్ అయితే మా గుళ్ళు ఎందుకు కనబడతాయి అని, మస్జిద్, దర్గా ఎందుకు కనబడవని పోలీసులు వాస్తవాలను వెల్లడించాలని కోరారు. ఓ వ్యక్తిని అరెస్టు చేశారని మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు వారిని కూడా పోలీసులు అరెస్టు చేసి శిక్షించాలని ఆయన పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. తనని ఎన్ని రోజులు హౌస్ అరెస్ట్ చేస్తారని, ఈరోజు కాకుంటే రేపు గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటానని, హిందూ కార్యకర్తలకు వెంబడి నిలబడాలని అనుకుంటున్నానని కానీ పోలీసులు ఈ విధంగా హౌస్ అరెస్ట్ చేస్తారని అనుకోలేదని అన్నారు. అదే విధంగా దాడికి పాల్పడిన వారిని కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు.

# సీడబ్ల్యూసీ, ఎఫ్‌సీఐ గోదాం ప్రారంభం..





**మెదక్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :** జిల్లాలోని మిల్లర్లు త్వరితగతిన బియ్యం అందజేయుటకు సీడబ్ల్యూసీ, ఎఫ్‌సీఐ గోదాం అందుబాటులోకి తీసుకువచ్చామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మెదక్ పట్టణంలో సీడబ్ల్యూసీ గోదాంను జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ గతంలో మిల్లర్లు ఎఫ్‌సీఐకు బియ్యం అందజేయడం ప్రతి సారి వారి నుండి సమస్యల ఉత్పన్నమవుతున్న సందర్భంలో ఈ సమస్య నుండి బయటపడేందుకు జిల్లాలో సీడబ్ల్యూసీ గోదాం నిర్మించుకొని ప్రారంభించుకున్నామన్నారు. జిల్లాలోని మిల్లర్లు త్వరితగతిన బియ్యం అందజేసేందుకు, జిల్లాలో మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం రికవరీ కూడా చాలా సులభతారం కావడానికి ఈ గోదాం సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరా అధికారి సురేశ్‌రెడ్డి, జిల్లా మేనేజర్ హరికృష్ణ, ఎఫ్‌సీఐ అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో దేవి నవరాత్రి ఉత్సవాలు

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం) :** దుర్గాష్టమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. దౌల్తాబాద్ మండల కేంద్రంలో పాపమ్మ గడ్డ దుర్గామాత ఆలయంలో నిర్వహించిన శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం ముగిసాయి. కొలసిన వారికి కొంగుబంగారం పాపమ్మ గడ్డ దుర్గామాత విరజిల్లుతుంది. దౌల్తాబాద్ మండల కేంద్రంలో పాపమ్మ గడ్డ దుర్గామాతగా పిలువబడే అతి పురాతనమైన దుర్గమ్మ దేవాలయాన్ని పునః నిర్మాణం చేసినప్పటినుంచి ప్రతినిత్యం అమ్మవారికి భక్తులు పూజలను నిర్వహించి ముడుపులు కట్టి ముక్కులు చెల్లించుకుంటున్నారు. అలాగే ప్రతి సంవత్సరం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రోజులుగా వివిధ రూపాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం చివరి రోజు కావడంతో నిమజ్జనం చేయడం ఊరేగింపు నిర్వహించారు.



# క్రీడలతో మానసికఉల్లాసం


## దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్


**దౌల్తాబాద్, అక్టోబర్ 14(ప్రజాస్వరం) :** క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు రహీముద్దీన్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో నర్రా రాజేందర్ యువసేన ఆధ్వర్యంలో క్రీడా పోటీల ముగింపులో పాల్గొని గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా పోటీలలో గెలుపోటములు సహజమని గెలిచిన వారికి అహంకారం ఉండకూడదని, ఓడినవారు కృంగిపోకూడదన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని క్రీడలతో గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. బతుకమ్మ దసరా దీపావళి పండుగల సందర్భంగా ప్రతి సంవత్సరం క్రీడ పోటీలు నిర్వహిస్తున్న ఎన్ఆర్ సేన వ్యవస్థాపకులు నర్ర రాజేందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్ర సత్యం, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సల్ల స్వామి, నాయకులు రాజు, ప్రశాంత్, సురేష్, శ్రీకాంత్, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :** కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మెదక్ జిల్లా హవెలిఘనపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బుస్సా సత్తయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో, మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మార్గం యాదగిరి ఇటీవల విద్యుత్ షాక్ ప్రమాదంలో మరణించాడు. ఇద్దరికీ పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా ద్వారా మంజూరైన 2 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కులను సత్తయ్య సతీమణి బుస్సా ముత్యాలుకు, యాదగిరి సతీమణి మార్గం లక్ష్మిలకు పద్మాదేవేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలకు ప్రమాద వశాత్తు ఏమైనా జరిగితే వారి కుటుంబానికి అండగా ఉండటానికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించారన్నారు. ఇంట్లో కుటుంబ పెద్దను కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు 2 లక్షల చెక్కుతో ఆర్థికంగా కొంత ఊరట కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, అంజగౌడ్, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, మెదక్ మాజీ వైసీపీ మార్గం అంజనేయులు, శమ్నాపూర్ మాజీ సర్పంచ్ లింగం, మాజీ వైస్ ఎంపీపీ రాధాకిషన్ యాదవ్, నాయకులు కిష్టయ్య, రాజు, శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, సతీశ్‌రావు, రాజేశ్వర్‌రావు, యువ నాయకులు వినయ్, అనిల్, హరీష్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి




**మెదక్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :** బదిలీ పొంది, రిలీవ్ కానీ సమయం లోనే ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుల సోమవారం ఖాళీలను నింపాలని పీఆర్టీయూటీఎస్ నాయకులు మెదక్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ ఏడీ విజయకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్జెక్ట్ టీచర్ లేని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో డీఎస్సీ 2024 ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యతగా భర్తీ చేయాలన్నారు. సింగిల్ స్కూల్స్‌లో ట్రాన్స్‌ఫర్ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తూ ఆ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా సాంక్షన్ పోస్ట్ ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులను నింపాలని తెలిపారు. ఆఫ్‌లైన్ డీఎస్సీ 2024 కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టాలని, రెండు పోస్టులకు సెలెక్ట్ అయిన ఉపాధ్యాయుల నుండి ఒక్క పోస్టుకు విల్లింగ్ లెటర్ తీసుకోవాలన్నారు. మిగిలిపోయిన మరొక పోస్టును తదుపరి వారితో నింపాలని సాంకేతిక కారణాల వల్ల అవకాశం కోల్పోయిన అభ్యర్థులకు వారి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలని జిల్లా విద్యాశాఖ ఏడీ విజయకి కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్, సంగమేశ్వర్, మెదక్ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్, రాష్ట్ర కార్యదర్శి విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదును పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్







**మెదక్, అక్టోబర్ 14 (ప్రజా స్వరం) :** సభ్యత నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ సభ్యత్వ నమోదుపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదు తీరు పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి డాక్టర్ మురళీధర్‌గౌడ్, రాగి రాములు, జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, రాజేందర్, రఘువీర్‌రెడ్డి, నందారెడ్డి, గడ్డం కాశీనాథ్, బండి సత్యనారాయణ, శ్రీనివాస్, సతీష్, రాజు, చంద్రశేఖర్, నాయిని ప్రసాద్ పాల్గొన్నారు.




## ‘8 వసంతాలు’ స్పెషల్ టీజర్ రిలీజ్

అనంతిక సానిల్ కుమార్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న చిత్రం ‘8 వసంతాలు’ మైత్రీ మూవీస్ బ్యానర్‌పై రానుంది. ఫణింద్ర దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం నుంచి ప్రత్యేక టీజర్ విడుదలైంది. హీరోయిన్ పాత్రను పరిచయం చేస్తూ.. ‘శుద్ధీ అయోధ్య టీజర్’ పేరుతో చిత్రబృందం దీన్ని పంచుకుంది. ‘అందాన్ని దాటి చూడగలిగితే ఆడదానిలో ఓ సముద్రమే కనపడుతుంది’ అంటూ ఆసక్తిగా ఉన్న ఆ టీజర్‌ను మీరూ చూసేయండి..

## నా సమస్య తెలిసే పెళ్లి చేసుకున్నాడు



అర్థం చేసుకునే భర్త అందరికీ దొరకడు. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. నా బలహీనతల్ని కూడా ప్రేమించే వ్యక్తి నాకు భర్తగా రావడం అదృష్టం కాక మరేంటి? అని అంటున్నది బాలీవుడ్ సూపర్‌హీరోయిన్ అలియాభట్. రీసెంట్‌గా తనకున్న మానసిక రుగ్మత గురించి ఆమె ఓ కార్యక్రమంలో బయట పెట్టారు. ‘నాకు చిన్నప్పట్నుంచీ హైపర్ టెన్షన్ సమస్య ఉన్నది. అర్థం చేసుకునే భర్త అందరికీ దొరకడు. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. నా బలహీనతల్ని కూడా ప్రేమించే వ్యక్తి నాకు భర్తగా రావడం అదృష్టం కాక మరేంటి? అని అంటున్నది బాలీవుడ్ సూపర్‌హీరోయిన్ అలియాభట్. రీసెంట్‌గా తనకున్న మానసిక రుగ్మత గురించి ఆమె ఓ కార్యక్రమంలో బయట పెట్టారు. ‘నాకు చిన్నప్పట్నుంచీ హైపర్ టెన్షన్ సమస్య ఉన్నది.అయినదానికీ కాని దానికీ టెన్షన్ పడిపోవడం నా బలహీనత. ఒక్కోసారి ఈ విషయంలో నియంత్రణ కోల్పోతుంటా. ఈ విషయం తెలిసి కూడా నన్ను పెళ్లి చేసుకున్నాడు రణబీర్. రెండేళ్ల క్రితం క్రిస్మస్ టైమ్‌లో ఇద్దరం లంచ్‌కి బయటకు వెళ్లాం. అప్పుడు అనుకోకుండా ఈ సమస్య తలెత్తింది. అలాగే మా కుమార్తెకు ‘రాహా’ అని పేరు పెట్టిన తర్వాత మీడియాకు పరిచయం చేద్దామని ఫస్ట్‌లో అనుకున్నాం. కానీ.. నా హైపర్ టెన్షన్ వల్లే అది కుదర్లేదు. నిజానికి ఇది కనిపించనంత పెద్ద సమస్య. దాన్ని భరించే వాళ్లకు ఓర్పు అవసరం. నేను ఇలా హైపర్ టెన్షన్‌కి గురైన ప్రతిసారీ.. రణబీర్ తెలివిగా టాపిక్ మార్చేసి ఏవేవో మాట్లాడుతూ, నన్ను మామూలు మనిషిని చేస్తాడు.’ అంటూ చెప్పుకొచ్చింది అలియా.




## సంక్రాంతి బరిలో.. సుమంత్ ‘మహేంద్రగిరి వారాహి’

కాస్త విరామం తర్వాత సుమంత్ నటిస్తోన్న కొత్త చిత్రం మహేంద్రగిరి వారాహి రాజశ్యామల బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబరు 2గా తెరకెక్కుతున్న ఈ చిత్ర గ్లిమ్స్ ను ఇటీవల ప్రముఖ దర్శకుడు క్రిష్ విడుదల చేశారు. అయితే ఈ మూవీ గ్లిమ్స్ ఆసక్తికరంగా ఉందంటూ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేయడంతో గ్లిమ్స్ కు మరింతగా స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సుమంత్ చివరగా 2021లో మళ్లీ మొదలైంది సినిమాలో కథానాయకుడిగా నటించగా 2022లో ధనుష్ సార్, తుల్కర్ సల్మాన్ సీతారామం సినిమాల్లో క్యారెక్టర్ పాత్రల్లోనటించారు. ఇప్పుడు మైడేండ్ల విరామం తర్వాత హీరోగా ‘మహేంద్రగిరి వారాహి’ అనే ఓ ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయ్యాడు.‘రంగమార్తాండ’ వంటి సినిమా తర్వాత రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సంతోష్ జాగర్లమూడి దర్శకుడిగా, మీనాక్షి గోస్వామి కథానాయికగా పరిచయం అవుతోంది. బ్రహ్మానందం కీలక పాత్రలో నటిస్తున్నాడు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నాడు.మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశం ఆధారంగా చేసుకుని ఈ సినిమాను రూపొందిస్తున్నామని చిత్ర నిర్మాత కాలిపు మధు తెలిపారు. వచ్చే ఏడాది.. 2025 సంక్రాంతికి ఈమహేంద్రగిరి వారాహి చిత్రాన్ని విడుదల చెయ్యడానికి యూనిట్ సన్నాహాలు చేస్తోంది.



## శ్రద్ధా టార్గెట్ రాహుల్

‘స్త్రీ2’ విజయంతో మంచి జోష్ మీద ఉన్నది బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ సినీ రచయిత రాహుల్‌తో రిలేషన్‌లో ఉన్నదని గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. వీరిద్దరూ కలిసి పలు పార్టీలకు హాజరైన ఫొటోలు కూడా నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి అనే అంశాల గురించి శ్రద్ధా కపూర్ మాట్లాడటం చర్చనీయాంశమైంది.‘పెళ్లి ముఖ్యం కాదు. బంధమే ముఖ్యం. సరైన వ్యక్తిని భాగస్వామిగా ఎంచుకుంటే జీవితం అందంగా ఉంటుంది. ఇష్టమైన వ్యక్తితో సమయాన్ని గడపటం నాకిష్టం. కలిసి డిన్నర్‌కి వెళ్లడం, సినిమాలు చూడటం, ప్రయాణాలు చేయడం.. అవన్నీ నాకెంతో సంతోషాన్నిస్తాయి.’ అంటూ చెప్పుకొచ్చింది శ్రద్ధాకపూర్. శ్రద్ధ మాట్లాడిన ఈ మాటలన్నీ రాహుల్‌ని ఉద్దేశించే అనీ పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలావుంటే.. రీసెంట్‌గా రాహుల్‌ని తన ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసింది శ్రద్ధా.




## ‘దో పత్తి’ ట్రైలర్ వచ్చేసింది.

బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్, కాజోల్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా ‘దో పత్తి’. కృతి డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిన ఈ చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. కృతి సనన్ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చి పదేళ్లు దాటింది. అయితే, ఇప్పటి వరకు నటిగా మాత్రమే గుర్తింపు తెచ్చుకున్న ఆమె తొలిసారి ఈ చిత్రం ద్వారా నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టింది. బ్లూ బటర్‌ఫ్లై ఫిలిమ్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించింది. అక్టోబర్ 25 నుంచి ‘దో పత్తి’ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. హిందీతో పాటు తెలుగులో కూడా ఈ మూవీ అందుబాటులో ఉండనుంది. మిస్టరీ థ్రిల్లర్ కథతో రానున్న ఈ చిత్రంలో కాజోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. 2015లో దిల్‌వాలే సినిమాలో కృతి సనన్, కాజోల్ ఇద్దరూ కలిసి తొలిసారి నటించారు. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ 'దో పత్తి' సినిమాతో వెండితెరపై కనిపించనున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999